బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా అధ్యక్షుడిగా ఉమామహేంద్ర


ఉమామహేంద్ర

చార్మినార్: బీజేపీ గోల్కొండ గోషామహల్ జిల్లా అధ్యక్షుడిగా చార్మినార్ ప్రాంతానికి చెందిన టి.ఉమామహేంద్ర నియమితులయ్యారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర సహ ఎన్నికల అధికారి గీతామూర్తి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే గ్రేటర్ హైదరాబాద్ బీజేపీ ఉపాధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించిన ఆయన గోల్కొండ జిల్లా ఏర్పడిన అనంతరం ఆ జిల్లాకు ప్రధాన కార్యదర్శిగా కొనసాగారు. గతంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో చార్మినార్ శాసన సభ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా ఎన్నికల బరిలోకి దిగి గెలుపు కోసం ముమ్మర ప్రయత్నం చేశారు.

పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చూడాలి


సలావుద్దీన్ లోధీ

చార్మినార్: రంజాన్ మాసంలో పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ చార్మినార్ శాసన సభ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ జీహెచ్ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నను గురువారం ఓ ప్రకటనలో కోరారు. రంజాన్ మాసంలో ముస్లింలు ప్రతిరోజూ ఉపవాసం ఉంటూ రోజుకు ఐదుసార్లు నమాజు చేస్తూ నిష్టగా ఉంటారన్నారు. దీంతో పాతబస్తీలోని అన్ని ప్రాంతాలన్నీ శుభ్రంగా ఉండే విధంగా అదనపు పారిశుద్ధ్య సిబ్బందిని ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు చెత్త కుప్పలను తొలగించాలని ఆయన కోరారు. దారుషిఫా, పురానీహవేలీ, మీరాలంమండి చార్మినార్, మక్కా మసీదు, గుల్జార్‌హౌస్, మదీనా, పత్తర్‌గట్టి, పురానాపూల్, మూసాబౌలి తదితర ప్రధాన రోడ్లతో పాటు అంతర్గత రోడ్లలోని మసీదుల వద్ద చెత్త కుప్పలు పేరుకుపోకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.

సరోజినీ నాయుడికి ఘన నివాళి


నివాళులర్పిస్తున్న మనిలాల్‌షా, హన్మంతరావు తదితరులు

అఫ్జల్‌గంజ్: స్వాతంత్ర సమరయోధురాలు సరోజినీనాయుడు జయంతిని గురువారం ఘనంగా నిర్వహించారు. గాంధీభవన్‌లో జరిగిన వేడుకల్లో ఆమె చిత్రపటానికి టీపీసీసీ కార్యదర్శి మనిలాల్ షా, మాజీ ఎంపీ హన్మంతరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు.

అర్హులందరికీ రేషన్‌కార్డులు జారీ చేయాలి



అఫ్జల్‌గంజ్: అర్హులందరికీ ప్రభుత్వం వెంటనే రేషన్‌కార్డులు జారీ చేయాలని గోషామహల్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు కోటి శైలేష్ కురుమ పేర్కొన్నారు. గురువారం గోషామహల్ పరిధిలోని పలు ప్రాంతంల్లో రేషన్ కార్డుల దరఖాస్తులను పలువురికి అందజేశారు. అనంతరం కోటి శైలేష్‌కురుమ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే రేషన్ కార్డుల జారీ ప్రక్రియ వేగంగా చేపట్టాలన్నారు. అధికారుల దృష్టికి పలు సమస్యలు తీసుకువెళ్లి పరిష్కరిస్తామని వెల్లడించారు.

దారిదోపిడీ దొంగల రిమాండ్

డబీర్‌పురా: దారి దోపిడీకి పాల్పడిన ఏడుగురు నిందితులలో ఒక మైనర్‌తో పాటు నలుగురిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు మలక్‌పేట్ ఏసీపీ శ్యాంసుందర్ తెలిపారు. ఈ ఘటన డబీర్‌పురా పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. డబీర్‌పురా ఇన్‌స్పెక్టర్ నాను నాయక్, డీఐ ప్రభాకర్, ఎస్ఐలు శ్రీధర్, నాగన్నతో కలిసి ఏసీపీ శ్యాంసుందర్ వివరాలు వెల్లడించారు. మెదక్‌కు చెందిన మహ్మద్ వాజుద్దీన్ (26) ఓలా ద్విచక్ర వాహనం నడుపుతూ ఈదీ బజార్‌లో ఉంటున్నాడు. ఈ నెల 8న రాత్రి ఒంటి గంటకు విధులు ముగించుకుని ఆజంపురా–డబీర్‌పురా దారిలో బీర్ తాగడానికి ద్విచక్ర వాహనాన్ని ఆపాడు. అక్కడే ఉన్న ఐదుగురు వాజుద్దీన్‌ను అడ్డుకొని అతని వద్ద నుంచి రూ.5000 లాక్కోవడమే కాకుండా అతని ఏటీఎం లో రూ.3000 డ్రా చేసుకున్నారు. భయపడిన బాధితుడు ఘటన జరిగిన 3 రోజుల తర్వాత అంటే ఈనెల 11న డబీర్‌పురా పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీసీ పుటేజీల ఆధారంగా యాకుత్‌పురాకు చెందిన మహమ్మద్ అబ్దుల్లా (22), సంతోష్‌నగర్కు చెందిన మహమ్మద్ అయూబ్(28), రైన్ బజార్‌కు చెందిన సోహెల్ ఖాన్(23), తలాబ్ కట్టాకు చెందిన సయ్యద్ ఓమర్(25), మరో మైనర్ బాలుడితో పాటు బార్కాస్‌కు చెందిన ఫరీద్, యాకుత్‌పురాకు చెందిన విశాల్ తదితర నిందితులను గుర్తించారు. ఇందులో ఒక మైనర్ నిందితునితో పాటు నలుగురు నిందితులను గురువారం యాకుత్‌పురా రైల్వే స్టేషన్ ప్రాంతంలో ఉన్నట్టు తెలుసుకొని అరెస్టు చేసినట్లు ఏసీపీ తెలిపారు. పరారీలో ఉన్న మరో ఇద్దరి కోసం వెతుకుతున్నామన్నారు.

గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం

అబిడ్స్: గోషామహల్ నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామని ఎమ్మెల్యే రాజాసింగ్ పేర్కొన్నారు. బేగంబజార్, ఫీల్‌ఖానా, మంగళ్‌హాట్ పూసల బస్తీలో, దత్తాత్రేయనగర్‌లో రోడ్ల నిర్మాణాల పనులు ఆయన కార్పొరేటర్ శంకర్ యాదవ్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ..నియోజకవర్గ అభివృద్ధి కోసం ధూల్‌పేట్‌లోని తన కార్యాలయం ప్రజలకు అందుబాటులో ఉంటానన్నారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన కార్యాలయంలో ఫిర్యాదు చేస్తే వెంటనే పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. బేగంబజార్ కార్పొరేటర్ శంకర్ యాదవ్ మాట్లాడుతూ..బీజేపీతోనే అభివృద్ధి సాధ్యమన్నారు. ప్రధాని నరేంద్రమోదీ ప్రభుత్వ పథకాలను ఇంటింటా అందించేందుకు కృషి చేస్తామన్నారు.


బేగంబజార్‌లో పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ శంకర్ యాదవ్

దేవాదాయ శాఖ భూమిని కబ్జా చేస్తే సహించం


దేవాదాయ శాఖ భూమిలో వెలసిన గూడారాలను పరిశీలిస్తున్న బీజేపీ నాయకులు

చాంద్రాయణగుట్ట: లలితాబాగ్ కాళికామాత ఆలయ భూములలో అక్రమంగా తిష్ట వేసి వ్యాపారులు చేయిస్తున్న వారిపై తగిన చర్యలు తీసుకోవాలని చాంద్రాయణగుట్ట బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ ఎడ్ల పండరీనాథ్ డిమాండ్ చేశారు. ఆ స్థలాన్ని గురువారం ఆయన స్థానిక నాయకులతో కలిసి పరిశీలించారు. కోట్లాది రూపాయల విలువైన దేవాదాయ శాఖ భూమిలో కొందరు అక్రమంగా స్క్రాప్ దుకాణాలు నిర్వహిస్తున్నారన్నారు. వీటి వెనుక కబ్జాదారుల హస్తం ఉందన్నారు. గతంలో కూడా ఈ స్థలాన్ని కబ్జా చేసేందుకు యత్నించడంతో స్వయాన అప్పటి పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్ ఆందోళన చేశారని గుర్తుచేశారు. అనంతరం దేవాదాయ శాఖ అదనపు కమిషనర్‌ను కలిసి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ డివిజన్ అధ్యక్షుడు మధుసూదన్, సీనియర్ నాయకులు బర్ల శ్రీనివాస్, రాజేందర్, మాణిక్, దేవేందర్, మల్లేష్, రవి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

జాహ్నవి కాలేజీపై చర్యలు తీసుకోండి



అబిడ్స్: నగరంలోని జాహ్నవి పీజీ కళాశాల విద్యార్థుల వద్ద అధిక ఫీజులు వసూలు చేస్తుందని టీపీసీసీ ఓబీసీ సెల్ ప్రధాన కార్యదర్శి పోల్కం శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గురువారం ఎంపీ ఆర్.కృష్ణయ్యను కలిసి ఆయన ఫిర్యాదును అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ..జహ్నవి కళాశాలలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ప్రిన్సిపల్ సెక్రెటరి శాంతకుమారి విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య సానుకూలంగా స్పందించారు. జాహ్నవి కళాశాల అధిక ఫీజులపై తాను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్తానని హామీ ఇచ్చారు.

భక్తిశ్రద్ధలతో షబ్-ఏ-బరాత్


మాట్లాడుతున్న మౌలానా సయ్యద్ మతీన్‌అలీషా ఖాద్రి

గోల్కొండ: షబ్-ఏ-బరాత్ రోజు ఉపవాసం ఉండి ఆరోజు రాత్రి ప్రార్థనలు చేసిన వారిని అల్లా క్షమిస్తాడని ఆల్ ఇండియా కీరత్ కమిటీ అధ్యక్షుడు మౌలానా కారీ సయ్యద్ మతీన్‌అలీషా ఖాద్రి అన్నారు. గోల్కొండ దిలావర్ షానగర్‌లోని మసీదులో జరిగిన కార్యక్రమంలో ఆయన షబ్-బే-బరాత్ గురించి మాట్లాడారు. ఉపవాసం ఉంటూ ప్రార్థనలు చేస్తే వారు కోరుకున్న రంగాల్లో విజయాలు సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో గోల్కొండ పరిసరాల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున ముస్లింలు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న మౌలానా మహమూద్ సాజిద్

శాలిబండలో..

శాలిబండ: షబ్-ఏ-బరాత్ ముస్లింలకు క్షమాపణ, ఆశీర్వాదాల పవిత్రమైన రాత్రిగా భావించబడుతుందని శాలిబండ ఖాజీపురా నవాయత్ మసీదు ఇమామ్ మౌలానా మహమూద్ సాజిద్ అన్నారు. గురువారం రాత్రి నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రంజాన్‌కు ముందు జరుపుకునే షబ్-ఏ-బరాత్ రోజున రాత్రి సమయంలో ముస్లింలు ప్రత్యేక నమాజ్‌లు, ఖురాన్ పఠనం చేస్తూ తమ పాపాలు క్షమించాలంటూ వేడుకుంటరన్నారు. కొందరూ షాబాన్ 14వ రోజున ఉపవాసం ఉంటూ, తమ పూర్వీకుల సమాధులను సందర్శించి పూలు సమర్పించి స్మరించుకుంటూ ప్రార్థనలు చేస్తారన్నారు.

ఘనంగా సంత్ రవిదాస్ జయంతి


పూజల్లో దేవర శ్రీనివాస్, మహేష్కర్ కాంతిలాల్ తదితరులు

జియాగూడ: సంత్ రవిదాస్ మహరాజ్ సమ సమాజ నిర్మాణం కోసం కృషి చేశారని బీజేపీ రాష్ట్ర కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు దేవర శ్రీనివాస్ అన్నారు. సంజయ్‌నగర్‌లోని కమ్యూనిటీహాల్‌లో సూర్యవంశీ సంత్ రవిదాస్ మోచీ సమాజ సేవా సంఘ్ గౌరవ అధ్యక్షుడు మహేష్కర్ కాంతిలాల్ చౌదరి ఆధ్వర్యంలో సంత్ రవిదాస్ జయంతి వేడుకలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా దేవర శ్రీనివాస్ హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో కార్వాన్ నియోజకవర్గం బీజేపీ కో కన్వీనర్ శివకుమార్‌యాదవ్, సీనియర్ నాయకులు బాబూ గురు, జగదీష్ యాదవ్, లక్ష్మీనారాయణ, ముచ్చింతల సత్యనారాయణ, సుదర్శన్ ముదిరాజ్, రాజేందర్ డేగస్, జయశంకర్, సంతోష్, భాస్కర్, సేవా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

హైదరాబాద్ మోచి సంఘం ఆధ్వర్యంలో..

బహదూర్‌పురా: హైదరాబాద్ మోచి సంఘం ఆధ్వర్యంలోసంత్ రవిదాస్ మహరాజ్ జయంతి వేడుకలను గురువారం సంఘ సభ్యులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మాట్లాడుతూ.. సంత్ రవిదాస్ అడుగుజాడల్లో నడవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు సింది స్వామి, సెక్రటరీ పెంటయ్య, బైరి వినోద్ నాయబ్, ధనరాజ్, బైరి మురళి, బైరి రాజ్ కుమార్, సింది సుభాష్, మోహన్, సుధాకర్, రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

టీఎన్జీఓ నిలోఫర్ యూనిట్ నూతన కార్యవర్గం


నూతన కార్యవర్గానికి నియామక పత్రాలను అందజేస్తున్న కురాడి శ్రీనివాస్

నాంపల్లి: టీఎన్జీఓ నిలోఫర్ యూనిట్ నూతన కార్యవర్గాన్ని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. యూనిట్ అధ్యక్షుడిగా ఎస్.గోపాలకృష్ణ, ఉపాధ్యక్షుడిగా జి.శ్రీనివాస్, కార్యదర్శిగా ఇ.జె.జోయెల్, సంయుక్త కార్యదర్శిగా జి.జనార్దన్, కోశాధికారిగా కె.జగన్‌మోహన్ రెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శిగా ఐ.సరిత, కార్యవర్గ సభ్యులుగా నాగరాజు, మహ్మద్ అబ్దుల్ అజీజ్ ఇర్ఫాన్ నియమితులయ్యారు. ఈ మేరకు నూతన కార్యవర్గం హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు విక్రమ్, కార్యదర్శి కురాడి శ్రీనివాస్, అసోసియేట్ అధ్యక్షుడు కె.ఆర్.రాజ్‌కుమార్ చేతుల మీదుగా నియామక ఉత్తర్వులను అందుకున్నారు.

ఫుట్‌పాత్ ఆక్రమణల తొలగింపు

గోల్కొండ: రాందేవ్‌గూడ మెయిన్ రోడ్డుపై అక్రమంగా వెలిసిన, ఫుట్‌పాత్‌లపై ఉన్న డబ్బాలను గురువారం తొలగించారు. బల్దియా వారు చేపట్టిన ఈ స్పెషల్ డ్రైవ్‌లో ట్రాఫిక్ పోలీసులు, గోల్కొండ లా అండ్ ఆర్డర్ పోలీసుల సహకారంతో మెయిన్ రోడ్డుపై ఉన్న మసీదుల పక్కన రోడ్డుపై వెలిసిన పెద్ద పెద్ద డబ్బాలు, ఫుట్‌పాత్‌లపై ఉన్న టీ స్టాల్స్‌ను తొలగించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న ఈ రోడ్డు ఆక్రమణలకు ఎంత మాత్రం సహించేది లేదని పోలీసులు స్పష్టం చేశారు.


రాందేవ్‌గూడ వద్ద రోడ్డుపై డబ్బాలను తొలగిస్తున్న సిబ్బంది

హాకీలో రాణించిన నగర క్రీడాకారులు



గన్‌ఫౌండ్రీ: ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ హాకీ టోర్నమెంట్‌లో హైదరాబాద్ క్రీడాకారులు సత్తా చాటారు. 13 రోజులుగా ఆంధ్రప్రదేశ్‌లో జరుగుతున్న ఈ టోర్నమెంట్‌లో రీజనల్ స్పోర్ట్స్ బోర్డు క్రీడాకారులు అద్భుతంగా రాణిస్తున్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన క్రీడాకారులు త్వరలో జాతీయ స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని టీమ్ సభ్యులు తెలిపారు. టీమ్ క్యాప్టెన్ డి.ఆనంద్‌కుమార్, కోచ్ కె.రవిచంద్ర ప్రసాద్, టీమ్ మేనేజర్ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కారు దగ్ధం



గోల్కొండ: నడుస్తున్న కారు అకస్మాత్తుగా మంటల్లో చిక్కుకుని దగ్ధమైన ఘటన లంగర్‌హౌస్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాల్లోకి వెళితే..గురువారం రాత్రి లంగర్‌హౌస్ నుంచి నార్సింగ్ వైపుగా ఓ కారు వేగంగా వెళుతోంది. టిప్పుఖాన్ బ్రిడ్జి సమీపంలోకి రాగానే ఒక్కసారిగా కారులో నుంచి మంటలు చెలరేగాయి. వెంటనే కారులో నుంచి డ్రైవర్ బయటకు దూకేసి ప్రాణాపాయం నుంచి బయటపడగా కారు మాత్రం మంటల్లో దగ్ధమైంది. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనా స్థలానికి వచ్చి మంటలు ఆర్పారు. ఈ కారుకు సంబంధించిన వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

డాన్ హైస్కూల్‌కు సీఐటీడీ ఇండియా అవార్డు


అవార్డు అందజేస్తున్న గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

చార్మినార్: విద్యారంగంలో విశేష సేవలు అందిస్తున్న డాన్ విద్యా సంస్థలకు కౌన్సిల్ ఫర్ ఇండస్ట్రియల్ అండ్ ట్రేడ్ డెవలప్మెంట్ (సీఐటీడీ) ఇండియా సంస్థ ఉత్తమ అవార్డును అందించింది. గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ చేతుల మీదుగా డాన్ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్ వసీ ఉర్ రెహమాన్ ఈ అవార్డును అందుకున్నారు. 56 ఏళ్లుగా విద్యా రంగంలో నాణ్యమైన బోధనతో సహా నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం నిరంతరం పాటుపడుతున్న డాన్ విద్య సంస్థలను గుర్తించి, సీఐటీడీ ఈ అవార్డును ప్రదానం చేసింది. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్ వసీ ఉర్ రహమాన్ మాట్లాడుతూ.. పాతబస్తీలోని పురానీహవేలీ, మలక్‌పేట్‌లలో కొనసాగుతున్న రెండు బ్రాంచీలలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్‌తో పాటు రోబోటిక్స్ అంశాలపై విద్యా బోధనల ప్రధాన అంశంగా తీసుకున్న డాన్ హైస్కూల్ ముందుకెళుతుందన్నారు.

విజేతలకు సన్మానం


విజేతలతో మహ్మద్ నజీబ్ తదితరులు

గోల్కొండ: అండర్–14 బాలికల ఎలివెట్ 2025 విజేతలకు గురువారం సన్మానించారు. అఖిల భారత ఎలివెట్ 2025 అండర్–14 బాలికల ఫుట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో గోల్కొండ ఫుట్‌బాల్ టీమ్‌కు చెందిన అమ్మాయిలు విజేతలుగా నిలిచారు. బెంగళూరులో జరిగిన ఈ పోటీల విజేతలకు గురువారం గోల్కొండ ఒవైసీ ఫుట్‌బాల్ గ్రౌండ్‌లో తెలంగాణ ఫ్యామిలీ కౌన్సెలింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా మహ్మద్ నజీబ్ వారికి మెమొంటోలు అందజేసి అభినందించారు. ఇకనుంచి అండర్–14 విభా గంలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు ఈ టీమ్‌ను తాము దత్తత తీసుకుంటున్నామన్నారు. టీమ్‌కు కావాల్సిన అన్ని రకాల వసతులు కల్పించి తెలంగాణ ఫుట్‌బాల్ అసోసియేషన్ కోచ్ సఫ్దర్‌పాషాచే శిక్షణ ఇప్పిస్తామని ఆయన పేర్కొన్నారు. ఎంజేపీ డైరీ ప్రొడెక్ట్స్ మేనేజింగ్ డైరెక్టర్ మహ్మద్ గౌస్ విజేతలకు నగదు పురస్కారాలను అందజేశారు. సమీర్, ఫహాద్ తదితరులున్నారు.

సమీకృత ఆహార పదార్థాలతోనే ఎనీమియా దూరం

నాంపల్లి: ప్రపంచ రక్తహీనత (ఎనీమియా) అవగాహన దినోత్సవాన్ని గురువారం రెడ్‌హిల్స్‌లోని నిలోఫర్ ఆసుపత్రిలో నిర్వహించారు. ఆసుపత్రిలో జరిగిన అవగాహన సదస్సుకు సూపరింటెండెంట్ డాక్టర్ ఎస్.రవికుమార్ హాజరై ప్రసంగించారు. దేశ వ్యాప్తంగా 50 శాతం మంది రక్తహీనతతో బాధపడుతున్నట్లు చెప్పారు. ఐరన్, బీ12, పోలేటా విటమిన్లను సంవృద్ధిగా ఉండే సమీకృత ఆహార పదార్థాలతో సమస్యను అధిగమించవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ విజయ్‌కుమార్, ఆర్ఎంఓ–1 నాగజ్యోతి, అసోసియేట్ ప్రొఫెసర్ సిద్ధార్థ, వేణు, అసిస్టెంట్ ప్రొఫెసర్ నరేంద్ర పాల్గొన్నారు.


మాట్లాడుతున్న డాక్టర్ రవికుమార్

కులగణన సర్వే మరోసారి నిర్వహించాలి


సమావేశంలో అభివాదం చేస్తున్న వేముల వాడ మదన్‌మోహన్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన కుల గణన సర్వే శాస్త్రీయంగా జరగలేదని తెలంగాణ రాష్ట్ర విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ మాతృ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు వేముల వాడ మదన్‌మోహన్ విమర్శించారు. కులగణన సర్వే మరోసారి నిర్వహించాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు గురువారం బషీర్‌బాగ్‌లోని సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ..సమగ్ర కుటుంబ సర్వేలో విశ్వబ్రాహ్మణ విశ్వకర్మ జాతీయుల జనాభా లెక్కలు అవాస్తవంగా ఉన్నాయని ఆరోపించారు. బీసీ కమిషన్, ప్రణాళిక సంఘం కూడా తమకు ద్రోహం చేశాయని మండిపడ్డారు. తమ జనాభా వివిధ వృత్తులతో కలిపి 15 లక్షలకు పైగా ఉంటుందని స్పష్టం చేశారు. బీసీ కమిషన్, ప్రణాళిక సంఘం కమిషన్ల తీరుపై హైకోర్టులో సవాలు చేసినట్లు తెలియజేశారు. సమగ్ర కుటుంబ సర్వే అసంపూర్తిగా ఉన్నందునా తిరిగి సర్వే చేయడం ఒక్కటే మార్గమని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లాలుకోట వెంకటచారి, ప్రధాన కార్యదర్శి చొల్లేటి కృష్ణమాచారి, కోశాధికారి రాగిఫణి రవీంద్రచారి తదితరులు పాల్గొన్నారు.


అంతర్వేది బ్రహ్మోత్సవాల్లో మహతి ఆర్ట్స్‌కు అవకాశం

నాంపల్లి: అంతర్వేది బ్రహ్మోత్సవాల్లో ప్రదర్శనలిచ్చేందుకు నగరానికి చెందిన మహతి ఆర్ట్స్‌కు అవకాశం లభించింది. మహతి ఆర్ట్స్ సంస్థ వ్యవస్థాపకులు వింజమూరి లక్ష్మి బృందం క్లాసికల్ కర్ణాటక సంగీతాన్ని ప్రదర్శించారు. బ్రహ్మోత్సవాల్లో అవకాశం కల్పించిన అంతర్వేది ఆలయ ఈఓకు వింజమూరి లక్ష్మి కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహతి ఆర్ట్స్ కార్యదర్శి వి.కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

గోల్కొండ: గోల్కొండలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అతిథి అధ్యాపకుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నారు. కళాశాల ప్రిన్సిపాల్ శ్రీలక్ష్మి గురువారం ఓ ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. అప్లికేషన్, ముఖ్యశాస్త్రం, జంతుశాస్త్రం, ఇంగ్లిష్ విభాగాల్లో అధ్యాపకుల కోసం దరఖాస్తు చేసుకోవచ్చునని ఆమె తెలిపారు. పీహెచ్‌డీ, పీజీ, నెట్, సెట్‌తో పాటు బోధన అనుభవం ఉన్నవారికి నియామకంలో ప్రాధాన్యత ఉంటుందన్నారు. పోస్ట్ గ్రాడ్యుయేషన్‌లో కనీసం 55 శాతం మార్కులు ఉండాలని ఆమె స్పష్టం చేశారు. ఈ నెల 15న ఉదయం దరఖాస్తు చేసుకున్న వారికి మౌఖిక పరీక్ష ఉంటుందని, ఎంపికైన వారి ధ్రువపత్రాలను పరిశీలించి నియామకాలు పూర్తవుతాయన్నారు. ఆసక్తి, అర్హత ఉన్న వారు నేరుగా తమ వద్దకు వచ్చి దరఖాస్తు చేసుకోవాలన్నారు.

విద్యార్థి జీవితంలో ఎస్ఎస్‌సీ ఎంతో కీలకం


మాట్లాడుతున్న ఖారీ ఇమ్రాన్

గోల్కొండ: విద్యార్థి జీవితంలో పదో తరగతి పరీక్షలు ఎంతో కీలకమని సక్సెస్ విద్యా సంస్థల చైర్మన్ ఇర్ఫాన్ ఉల్లా అన్నారు. గురువారం గోల్కొండ జీఎంకే గార్డెన్‌లో పదవ తరగతి పరీక్షలు రాయబోతున్న విద్యార్థులకు పరీక్షలపై అవగాహన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..పరీక్షలు అంటే అనవసరంగా ఆందోళన చెందకుండా నిర్భయంగా పరీక్షలు రాసిన వారే మంచి మార్కులతో ఉత్తీర్ణులు అవుతారన్నారు. ఆల్ ఇండియా ఐడియల్స్ టీచర్స్ అసోసియేషన్, సక్సెస్ ది జూనియర్ కాలేజ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో గోల్కొండ, షేక్‌పేట్ మండలాలకు చెందిన ఉత్తమ ఉపాధ్యాయులకు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐటా గోల్కొండ మండల అధ్యక్షుడు షేక్ అజ్మత్ పాషా, రియాజ్ అలీఖాన్, హిదాయత్ అలీఖాన్, షాబాజ్ అహ్మద్ ఖాద్రీతో పాటు మోటీవేషనల్ స్పీకర్లు శ్రవంతి, ఖారీ ఇమ్రాన్‌ఖాన్, సయ్యద్ సమీఉల్లా, ఎంఎంహుస్సేన్, సయ్యద్ యూనూస్ పాల్గొన్నారు.

డ్రంకన్ డ్రైవ్‌లో వ్యక్తికి పది రోజుల జైలు

అబిడ్స్: డ్రంకన్ డ్రైవ్‌లో 4వ సారి పట్టుబడిన డ్రైవర్ మహ్మద్ అష్రఫ్‌కు పది రోజుల జైలు శిక్ష, రూ.3300 జరిమానా విధిస్తూ 12వ జేఎంఎఫ్‌సీ న్యాయస్థానం తీర్పునిచ్చినట్లు గోషామహల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ బాలాజీ తెలిపారు. బాబానగర్‌కు చెందిన మహ్మద్ అష్రఫ్ గతంలో మద్యం సేవించి మూడు పర్యాలు ఆసిఫ్‌నగర్, ఫలక్‌నుమా, చాంద్రయాణగుట్ట ప్రాంతాల్లో డ్రంకన్ డ్రైవ్ తనిఖీల్లో దొరికాడు. గోషామహల్ ట్రాఫిక్ పోలీసులకు అష్రఫ్ 4వసారి దొరకడంతో అతడిని ఇన్‌స్పెక్టర్ బాలాజీ ఆధ్వర్యంలో న్యాయస్థానంలో హాజరుపరిచారు. న్యాయమూర్తి 10 రోజుల జైలు శిక్ష, రూ.3300 జరిమానా విధించారు.